# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 13-05-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలోని 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో సాయంత్రం 5 గంటల వరకూ సుమారు 68 శాతం ఓటింగ్ జరిగింది.
- ❖ అభివృద్ధి ఆధారిత పాలన ద్వారా పేద రాష్ట్రాలు అభివృద్ధి చెందాయని బీజేపీ సీనియర్ నేత నరేంద్ర మోదీ తెలిపారు.
- ❖ ఎన్నికల నేపధ్యంలో జరిగిన అవాంఛనీయ ఘటనలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా స్పష్టం చేశారు.
- ❖ నైరుతి రుతుపవనాలు ఈ నెల 19వ తేదీ నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలోకి ప్రవేశించే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలియజేసింది.

==============================

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలకు ఈరోజు ఓటింగ్ జరిగింది. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాలకు, 25 లోక్‌సభ స్థానాలకు జరిగిన పోలింగ్‌లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 5 గంటల వరకు రాష్ట్ర వ్యాప్తంగా సగటున 68.04 శాతం ఓటింగ్ జరిగినట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలియజేసింది. విశాఖ జిల్లాలో 59 శాతం, ఎన్టీఆర్ జిల్లాలో 67 శాతం, అనకాపల్లి 58 శాతం, శ్రీకాకుళం 67 శాతం, తూర్పు గోదావరి 66 శాతం, ఏలూరు 72 శాతం, పల్నాడు 69 శాతం, కర్నూలు 64 శాతం, పశ్చిమ గోదావరి జిల్లాలో 72 శాతం ఓటింగ్ జరిగింది.

==============================

గతంలో పేదరికంలో ఉండే రాష్ట్రాలు అభివృద్ధి చెందడానికి బీజేపీ అభివృద్ధి ఆధారిత పాలనే కారణమని ఆ పార్టీ సీనియర్ నేత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్‌వ్యూలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వలేదని ఆరోపించారు. బిజెపి ప్రభుత్వాలు లక్షలాది మందికి లబ్ధి చేకూర్చే పథకాలను తీసుకువచ్చాయని, పేదలకు ఇళ్లు, యువతకు ఉపాధి అవకాశాలు, మహిళలకు సాధికారత కల్పించాయని వివరించారు. బీజేపీకి దేశం నలుమూలల నుండి మద్దతు లభిస్తోందని నరేంద్ర మోదీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

కాగా... నరేంద్ర మోదీ ఈరోజు పాట్నాలోని తకత్ శ్రీ హరిమందర్ జీ పట్నా సాహిబ్ గురుద్వారాను సందర్శించి, ప్రార్థనలు చేశారు. అక్కడి నుండి ఆయన ఆనంద్‌పుర్ సాహిబ్‌కు ప్రయాణమయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పలుచోట్ల జరిగిన అవాంఛనీయ ఘటనలను ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించింది. ఈ ఘటనలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా స్పందిస్తూ... తెనాలి, మాచర్ల, అనంతపురంలో జరిగిన సంఘటలకు బాధ్యులైన వారిని వెంటనే గృహ నిర్బంధం చేయాలని, వారిపై కేసులు పెట్టాలని ఆయా జిల్లాల ఎన్నికల, పోలీస్ యంత్రాంగాలను ఆదేశించారు. పుంగనూరులో జరిగిన సంఘటనలో నిందితులను విడిచిపెట్టిన పోలీస్ ఎస్ఐని వెంటనే విధుల నుండి తొలగించాలని ఆదేశించారు. అదేవిధంగా ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎటువంటి సంఘటనలు జరిగినా అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నైరుతి రుతుపవనాలు ఈ నెల 19వ తేదీ నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలోకి ప్రవేశించే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలియజేసింది. రానున్న రెండు రోజుల్లో ఉత్తర, దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతంలో ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు కురవచ్చని పేర్కొంది. ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశం ఉందని, గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి పేర్కొంటూ....

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

చిత్తూరు జిల్లాలో అపహరణకు తెలుగుదేశం పార్టీ ఏజెంట్లను గుర్తించి విధులకు హాజరపరచినట్టు రాష్ట్ర ప్రధాని ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం.. సదుం మండలం బోరకమందలో ముగ్గురు టిడిపి ఏజెంట్లు కిడ్నాప్ అయినట్లు వచ్చిన ఆరోపణలపై జిల్లా ఎన్నికల యంత్రాంగంతో పాటు, పోలీసుల యంత్రాంగం వెంటనే స్పందించిందని ఆయన పేర్కొన్నారు. కిడ్నాపైన ఏజెంట్లను పోలీసులు పీలేరులో గుర్తించి, వారిని వెంటనే విధులకు హాజరపరచడం జరిగినట్టు ఆయన స్పష్టం చేశారు. ఏజెంట్లు.. పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సమయంలో అపహరణకు గురయ్యారని టిడిపి జిల్లా ఇన్ ఛార్జి జగన్ మోహన్ రాజు చేసిన ఫిర్యాదుపై పోలీసులు తక్షణం స్పందించి తగు చర్యలు తీసుకున్నారని, ఈ అంశంపై దర్యాప్తు జరుగుతోందని ముఖేష్ కుమార్ మీనా వివరించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో ఈరోజు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గవర్నర్ సహా పలువురు ప్రముఖులు వివిధ కేంద్రాల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా.. విజయవాడ మధ్య నియోజకవర్గంలోని రైల్వే ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పులివెందుల నియోజకవర్గ కేంద్రంలోని బాకరాపురం పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి దంపతులు ఓటు వేశారు. తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణి నారా భువనేశ్వరి ఉండవల్లిలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి రాజమహేంద్రవరం వి.ఎల్.పురంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తమ ఓటు

హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా జనసేన పార్టీ అధ్యక్షులు కె. పవన్ కళ్యాణ్ మంగళగిరిలోని, లక్ష్మీనరసింహ స్వామి కాలనీ గిరిజన సహకార సంస్థ పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. వేంపల్లె మండలం, ఇడుపుల పాయ పోలింగ్ బూత్ లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిళ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రారంభదశలో రోగ నిర్ధారణ చేసి, చికిత్సను అందించడం ద్వారా కేన్సర్ రోగులను కాపాడవచ్చని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన చేస్తూ... హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ సెంటర్ సహకారంతో రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ... క్యాన్సర్ స్క్రీనింగ్‌పై శిక్షణా కార్యక్రమాలు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీలకు చెందిన ప్రివెంటివ్ ఆంకాలజిస్టులు పాల్గొని, సమగ్ర క్యాన్సర్ సంరక్షణపై జిల్లా స్థాయి సిబ్బందికి  శిక్షణ ఇస్తారని వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో 3 వేల మందికి పైగా వైద్యాధికారులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, అర్బన్ ANM లకు శిక్షణ అందిస్తారని ప్రకటనలో తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఈరోజు ప్రశాంతంగా మొదలైంది. ఉదయం పోలింగ్ మొదలయ్యే సమాయానికి ముందే ప్రజలు అధిక సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఎండతీవ్రత అధికంగా ఉండడంతో చాలామంది ఓటింగ్ త్వరగా ముగించుకోవాలని ఉదయం 7 గంటలకు ముందే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్‌లను ఏర్పాటు చేయడంతో పాటు, మంచినీరు, వైద్య శిబిరాలు వంటి ఏర్పాట్లు చేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈసారి ఎన్నికలలో వృద్ధులు, దివ్యాంగులు ఓట్లు వేసేందుకు ఆసక్తి చూపారు. దాదాపు అన్ని కేంద్రాల్లోనూ వృద్ధులు, దివ్యాంగులు పెద్ద సంఖ్యలో కనిపించారు. పోలీసులు, ఎన్నికల సిబ్బంది.. ఒంటరిగా వచ్చిన వారిని పోలింగ్ బూత్‌లకు తీసుకువెళ్ళేందుకు చేయూతనిచ్చారు. అదేవిధంగా వృద్ధులు, దివ్యాంగులు క్యూలైన్లలో వేచి ఉండే అవసరం లేకుండా వారు నేరుగా పోలింగ్ బూత్ లలోకి వెళ్ళేలా ఏర్పాటు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (CBSE) 10, 12వ తరగతి ఫలితాలు ఈరోజు విడుదలయ్యాయి. 10వ తరగతి పరీక్షలో మొత్తం 93.60 శాతం ఉత్తీర్ణులు కాగా... వీరిలో 94.75 శాతం బాలికలు, 92.71 శాతం బాలురు ఉన్నారు. 12వ తరగతి పరీక్షల్లో... గతేడాది కంటే 0.65 శాతం ఉత్తీర్ణత ఎక్కువగా... 87.98 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని సీబీఎస్ఈ తెలిపింది. ఈ పరీక్షలో 24 వేల మంది అభ్యర్థులు 95 శాతానికి పైగా మార్కులు సాధించగా, లక్షా పదహారు వేల మంది విద్యార్థులు 90 శాతానికి పైగా మార్కులు సాధించారు. ఈ ఫలితాలను సీబీఎస్ ఈ అధికారిక వెబ్‌సైట్‌తో పాటు, డిజిలాకర్, ఉమంగ్ యాప్‌ల ద్వారా తెలుసుకొనవచ్చని సీబీఎస్ఈ తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇండియన్ ప్రీమియర్ లీగ్ -2024లో భాగంగా ఈరోజు జరగబోయే మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో రాత్రి 7 గంటల 30 నిమిషాలకు ప్రారంభం కానుంది. కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు ఇప్పటికే  18 పాయింట్లు సాధించగా, గుజరాత్ టైటాన్స్ 10 పాయింట్లతో ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు లోక్‌సభ పరిధిలో 6 నియోజకవర్గాలు ఉండగా 3 నియోజకవర్గాల్లో పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగిసింది. అరకు, పాడేరు, రంపచోడవరం నియోజకవర్గాల్లో అధికారులు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సాయంత్రం 4 గంటల పోలింగ్ ముగించారు. అదేవిధంగా పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ,

కురుపాం, సాలూరులో సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసింది. ఈ నియోజకవర్గాలు కొండ ప్రాంతాల్లో ఉండడంతో అధికారులు పోలింగ్ సమయాన్ని కుదించారు.

==============================
==============================